# బ్రహ్మబిందూపనిషత్తు

– డా. కోగంటి రామానుజాచార్యులు

**ఉపోద్ఘాతము :**

**శ్లో. అమృతబిందూపనిషత్వేద్యం యత్పరమాక్షరమ్।**
**తదేవ హి త్రిపాద్రామచంద్రాఖ్యం నః పరాగతిః॥**

అథర్వవేదాన్తర్గత బ్రహ్మబిందూపనిషత్తులో మనోనిగ్రహంతో అమృత స్వరూపమైన పరంబ్రహ్మతత్వమును పొందే మార్గము బోధించబడినది. దీనినే అమృతబిందూపనిషత్ అని కూడా అంటారు.

మన మనస్సు 1. శుద్ధము 2. అశుద్ధము, అని రెండు విధములుగా ఉంటుంది. మనస్సుయొక్క అశుద్ధవిభాగము దృశ్యసంబంధమైన, కామసంబంధమైన సంకల్పములు కలిగి ఉంటుంది. ఇక రెండవ విభాగము కోరికలు లేనిదైన శుద్ధస్వరూపము. దానినే శుద్ధమనస్సు, కేవలమనస్సు, ఉన్మనీ అని అంటారు. కేవలమనస్సు బ్రహ్మమే.

**మన ఏవ మనుష్యాణాం కారణం బన్ధమోక్షయోః।**
**బంధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతమ్॥**

ఈ జీవుని బంధమునకుగాని, మోక్షమునకుగానీ కారణము మనస్సే. కనిపించే విషయములందు ఆసక్తి కలిగి ఉండటమే బంధము. మనస్సు విషయములను దాటిపోయి, సాక్షిత్వము వహిస్తూ, నిర్విషయత్వమును సంతరించుకోవటమే ముక్తి. ముముక్షువుయొక్క మానసికచర్యలన్నీ ఎప్పుడు ఆతనిపట్ల నిర్విషయత్వం పొందునో అప్పుడు ఆతని మనస్సు ముక్తిపొందినదగును. ముముక్షువు అలాంటి సాధన చేయాలి.

ఎప్పుడు విషయములందు ఆసక్తి విడచి, మనస్సు హృదయములో నిరోధించబడినదై ఆత్మభావన మాత్రమే కలిగి ఉంటుందో అదే పరమపదము. అందుచేత హృదయములో దృశ్యసంకల్పములు క్షయమయ్యేవరకు మనస్సును నిరోధిస్తూనే ఉండాలి. మనస్సును ప్రాపంచిక విషయంగా నిరోధిస్తూ, హృదయములో ఆత్మభావనయందు లగ్నం చేయడమే జ్ఞానము. అదే యోగము, ధ్యానము. పూజ, స్తుతి మొదలైన తదితర విషయాలన్నీ నిర్విషయ సాధనకోసం చెప్పబడే మార్గాలు మాత్రమే.

**స్వరేణ సంధయేద్యోగ మస్వరమ్భావయేత్పరమ్।**
**అస్వరేణ హి భావేన భావో నా భావ ఇష్యతే॥**

పరమాత్మ శబ్దములకు విషయం కాదు. భావనకు కూడా లభించదు. అయినప్పటికీ స్వరము (సంభాషణ-గానము) భావనలతో యోగమార్గంలో ఆత్మవస్తువును అనుసంధానం చేయటమే సాధన. బ్రహ్మము సర్వదా నిష్కళంకము నిర్వికల్పము, ఆద్యంతరహితము, అనంతము. అట్టి బ్రహ్మమే నేను అని తెలుసుకొనుటచే సర్వ బంధములనుండి వినిర్ముక్తుడై నిత్యమైన బ్రహ్మమును పొందవచ్చును.

వాస్తవానికి సర్వత్రా సర్వదా ఆత్మయే ఉన్నది. ఇక తదితరమైనదానికి దేనికీ ఉత్పత్తి వినాశనము లేదు. అంతా ఆత్మయే అయి ఉండగా బద్ధుడెవడు? ముక్తుడెవడు? బంధవిముక్తికై సాధకుడెవడు? మోక్షార్థియగు ముముక్షువు ఎవడు? పరమార్థంగా చూస్తే ఇవేవీ లేవు.

ఆత్మయొక్క లీలావిన్యాసమును తెలుసుకున్నవాడు “నేను జన్మించువాడను" అనే భ్రమను పొందడు. జన్మరహితుడౌతాడు. అందుచేత ఆత్మయే మననమునకు అర్హమైన సత్యవస్తువు.

**ఏక ఏవ హి భూతాత్మా భూతే భూతే వ్యవస్థితః।**
**ఏకధా బహుధా చైవ దృశ్యతే జలచంద్రవత్॥**

ఒకే చంద్రుడు ఆకాశములో ఉండి వేరువేరు తటాకములలో వేరువేరు ప్రతిబింబములుగా ప్రకాశిస్తున్నాడు. అలాగే సర్వభూతాత్ముడు ఏకమైయుండి వేరువేరు జీవులలో వేరువేరు ఆత్మలుగా వ్యవస్థితుడైనట్లు కనిపిస్తున్నాడు. ఆత్మ సర్వదా ఏకమే.

శబ్దాది మాయచేత (అంధకారముచే) ప్రజ్ఞ ఆవరించబడుతుంది. అట్టి శబ్దాది చీకటిని అధిగమించి, భిన్నత్వమును జయించి ఏకత్వమును ధ్యానించాలి.

**ద్వే విద్యే వేదితవ్యే తు శబ్దబ్రహ్మ పరం చ యత్।**
**శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరం బ్రహ్మాధిగచ్ఛతి॥**

వేదములలో పరతత్వము శబ్దాక్షరరూపంగా ప్రతిపాదించబడినది. ఆ శబ్దాక్షరములను విని, వాటిని అధిగమించి, వాటి అర్థాన్ని ధ్యాసతో ఉపాసించాలి. ఆవిధంగా శబ్దాది తన్మాత్ర విషయాలను అధిగమిస్తూ శాంతమగు ఆత్మయందు ఇచ్ఛను వృద్ధిచేసుకోవాలి. సాధకుడు శబ్దబ్రహ్మమును ఉపాసనచేసి, జ్ఞానానుభవము పొందాలి. ఇలా విచారణ అనుభూతులనబడే రెండిటియందు అభిరుచి, ఉపాసనలను వృద్ధిచేసుకోవాలి. శబ్దబ్రహ్మమునందు నిష్ణాతుడైనవాడు క్రమంగా పరబ్రహ్మానందానుభవమును చేరుకొంటున్నాడు.

పాలలో నేతివలె ప్రతిదేహిలోనూ ఆత్మజ్ఞానాను భూతిఉన్నది. అందుచేత పెరుగు చిలికినట్లు మనస్సును శాస్త్రప్రవచన జ్ఞానముచే చిలికి ఆత్మానుభూతిని పొందాలి. కట్టెకట్టెను ఒరిపిడిచేసి అగ్నిని పుట్టించినట్లు సాధనతో, జ్ఞాననేత్రాగ్నితో సర్వభేదములను భస్మముచేసి, నిష్కళంకమైన, నిశ్చలమైన, పరమశాంత స్వరూపమైన పరమాత్మయే నేను అను నిశ్చయమును దృఢపరచుకోవాలి.

**సర్వభూతాధివాసం చ యద్భూతేషు వసత్యపి।**
**సర్వానుగ్రాహకత్వేన తదస్మి 'అహం' వాసుదేవః॥**

సర్వభూతములకు(జీవులకు) ఆధారము, సర్వభూతములలో వసించువాడు, సర్వజీవులపై అనుగ్రహము ప్రసరింపజేయు ఆ వాసుదేవుడనగు నేనే అందరి యందు ఆత్మగా వేంచేసి ఉన్నాను అని తెలుసుకోవాలి. ఇదే బ్రహ్మబిందూపనిషత్తు ప్రతిపాదించే మోక్షమార్గము.

**ఇతి బ్రహ్మబిందూపనిషత్**

**స్వస్తి**

# బ్రహ్మబిందూపనిషత్

శ్లో. అమృతబిందూపనిషద్వేద్యం యత్పరమాక్షరం ।
తదేవ హి త్రిపాద్రామచంద్రాఖ్యం నః పరా గతిః ॥

ఓం సహ నావవతు । సహ నౌ భునక్తు । సహ వీర్యం కరవావహై ।
తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**అథ బ్రహ్మబిందూపనిషత్ ప్రారంభః**

ఓం మనో హి ద్వివిధం ప్రోక్తం శుద్ధం చాశుద్ధమేవ చ ।
అశుద్ధం కామసంకల్పం శుద్ధం కామవివర్జితం ॥ ॥ 1 ॥

మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః ।
బంధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతమ్ ॥ ॥ 2 ॥

యతో నిర్విషయస్యాస్య మనసో ముక్తిరిష్యతే ।
తస్మాన్నిర్విషయం నిత్యం మనః కార్యం ముముక్షుణా ॥ ॥ 3 ॥

నిరస్తవిషయాసంగం సన్నిరుద్ధం మనో హృది ।
యదా యాత్యున్మనీభావం తదా తత్పరమం పదమ్ ॥ ॥ 4 ॥

తావదేవ నిరోద్ధవ్యం యావద్ధృది గతం క్షయం ।
ఏతజ్జ్ఞానం చ ధ్యానం చ అతోఽన్యో గ్రంథవిస్తరః । ॥। 5 ॥

నైవ చింత్యం న వాచింత్యమచింత్యం చింత్యమేవ చ ।
పక్షపాత వినిర్ముక్తం బ్రహ్మ సంపద్యతే తదా ॥ ॥ 6 ॥

స్వరేణ సంధయేద్యోగమస్వరం భావయేత్పరం ।
అస్వరేణ హి భావేన భావో నాభావ ఇష్యతే ॥ ॥ 7 ॥

తదేవ నిష్కలం బ్రహ్మ నిర్వికల్పం నిరంజనం ।
తద్బ్రహ్మాహమితి జ్ఞాత్వా బ్రహ్మ సంపద్యతే ధ్రువమ్ ॥ ॥ 8 ॥

నిర్వికల్పమనంతం చ హేతుదృష్టాంతవర్జితం ।
అప్రమేయమనాదిం చ జ్ఞాత్వా చ పరమం శివమ్ ॥ ॥ 9 ॥

**న నిరోధో న చోత్పత్తిర్న బద్ధో న చ సాధకః ।**
**న ముముక్షుర్న వై ముక్త ఇత్యేషా పరమార్థతా ॥ ॥ 10 ॥**

**( పాఠభేదః– న విరేధో న చోత్పత్తిర్న వన్ధ్యో నచ శాసనం.**
**న ముముక్షా న ముక్తిశ్చేదిత్యేషా పరమార్థతా ॥10 ॥)**

ఏక ఏవాత్మా మంతవ్యో జాగ్రత్స్వప్నసుషుప్తిషు ।
స్థానత్రయాద్వ్యతీతస్య పునర్జన్మ న విద్యతే ॥ ॥ 11 ॥

ఏక ఏవ హి భూతాత్మా భూతే భూతే వ్యవస్థితః ।
ఏకధా బహుధా చైవ దృశ్యతే జలచంద్రవత్ ॥ ॥ 12 ॥

ఘటసంవృతమాకాశం లీయమానే ఘటే యథా ।
ఘటో లీయేత నాకాశం తద్వజ్జీవో నభోపమః ॥ ॥ 13 ॥

ఘటవద్వివిధాకారం భిద్యమానం పునః పునః ।
తద్భగ్నం న చ జానాతి స జానాతి చ నిత్యశః ॥ ॥ 14 ॥

శబ్దమాయావృతో యావత్తావత్తిష్ఠతి పుష్కరే ।
భిన్నే తమసి చైకత్వమేక ఏవానుపశ్యతి ॥ ॥ 15 ॥

శబ్దాక్షరం పరం బ్రహ్మ తస్మిన్ క్షీణే యదక్షరం ।
తద్విద్వానక్షరం ధ్యాయేద్యదీచ్ఛేచ్ఛాంతిమాత్మనః ॥ ॥ 16 ॥

ద్వే విద్యే వేదితవ్యే తు శబ్దబ్రహ్మ పరం చ యత్ ।
శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరం బ్రహ్మాధిగచ్ఛతి ॥ ॥ 17 ॥

గ్రంథమభ్యస్య మేధావీ జ్ఞానవిజ్ఞానతత్పరః ।
పలాలమివ ధాన్యార్థీ త్యజేద్గ్రంథమశేషతః ॥ ॥ 18 ॥

గవామనేకవర్ణానాం క్షీరస్యాప్యేకవర్ణతా ।
క్షీరవత్పశ్యతే జ్ఞానం లింగినస్తు గవాం యథా ॥ ॥ 19 ॥

ఘృతమివ పయసి నిగూఢం భూతే భూతే చ వసతి విజ్ఞానం ।
సతతం మంథయితవ్యం మనసా మంథానభూతేన ॥ ॥ 20 ॥

జ్ఞాననేత్రం సమాధాయ చోద్ధరేద్వహ్నివత్పరం ।
**(పాఠభేదం– జ్ఞాననేత్రం సమాదాయ చరేద్వహ్నిమతః పరమ్.)**
నిష్కలం నిర్మలం శాంతం తద్బ్రహ్మాహమితి స్మృతమ్ ॥ ॥ 21 ॥

సర్వభూతాధివాసం చ యద్భూతేషు వసత్యపి ।
సర్వానుగ్రాహకత్వేన తదస్మ్యహం వాసుదేవః తదస్మ్యహం వాసుదేవఇతి ॥ ॥ 22 ॥

ఓం సహ నావవతు । సహ నౌ భునక్తు । సహ వీర్యం కరవావహై ।
తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**ఇతి బ్రహ్మబిందూపనిషత్సమాప్తః**